క్లుప్తంగా

సాయిచరణ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): షికాగోలో నల్లజాతీయుల కాల్పుల్లో గాయపడిన భారతి నగర్ డివిజన్‌కు చెందిన సాయి చరణ్ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించారు. సాయి చరణ్ ఆరోగ్య పరిస్థితిని, సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున సాయిచరణ్ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ చేయాలని నిరసన

జిన్నారం(పటాన్‌చెరు): భాషాపండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గుమ్మడిదలలోని ప్రభుత్వ పాఠశాలలో లంచ్ సమయంలో మంగళవారం ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాషాపండితులు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం చెప్పినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అజ్మతుల్లా ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): బాలికల విద్యాభివృద్ధికి కృషి చేయాలని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. మంగళవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, హోప్‌ల ఆధ్వర్యంలో జాతీయ బాలికాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతదేశం పురాతన కాలం నుంచి స్త్రీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన పుణ్యభూమి అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశం, డా పద్మజ, డా అభిజిత్, డా సిద్దులు, డా జగదీశ్వర్, శివదీప్తి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

జహీరాబాద్ టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యాపారులు అదనపు కలెక్టర్ రాజర్షిషాతో వేడుకొన్నారు. జహీరాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన దుకాణాల కేటాయింపులో వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో అదనపు కలెక్టర్ రాజర్షిషాతో వ్యాపారులు సమావేశమయ్యారు. మంగళవారం వ్యాపారులతో చర్చించారు. జహీరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న అన్ని దుకాణాల కంటే ఈ కాంప్లెక్స్‌లో అద్దె అత్యధికంగా ఉన్నందున తాము ముందుకు రావడంలేదని వ్యాపారులు పేర్కొన్నారు. అద్దె ప్రారంభ ధరను50 శాతం తగ్గించాలని వారు కోరారు. నోటిఫికేషన్‌లో ప్రచురితమైన దుకాణాల కొలతల్లో తప్పులు ఉన్నాయని దీనివల్ల వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోతారని వాటిని సరిదిద్దాలని కోరారు. ఈ విషయంలో అధికారులు సానుకూలంగా స్పందించాలని వ్యాపారులు కోరారు. అనంతరం వ్యాపారులు కలెక్టర్ శరత్ కుమార్‌తో మాట్లాడారు. ఈ సమావేశంలో కమిషనర్ మల్లారెడ్డి, నామ రవికిరణ్‌గుప్త, మాజీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్, పట్టణ రజక సంఘం అధ్యక్షుడు సందీప్ మడివాల్, అల్లాడి శంకర్, సూరంపల్లి ఆంజనేయులు, మాడిశెట్టి శ్రీనివాస్, పాండురంగం పాల్గొన్నారు.

ప్రతిభ నిరూపించుకునేందుకే టోర్నీలు

న్యాల్‌కల్(జహీరాబాద్): యువతలో దాగి ఉన్న ప్రతిభ నిరూపించుకునేందుకు టోర్నీలు దోహద పడుతాయని జహీరాబాద్ డీఎస్పీ రఘు అన్నారు. మంగళవారం మెటల్‌కుంట గ్రామంలో పాలక మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్, కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీలను డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ వెంకటేశం, హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్, సర్పంచ్ పీటర్‌రాజు, ఉప సర్పంచ్ ప్రియాంక నాయకులు రాజేదర్‌రెడ్డి, షరీఫ్, వెంకటేశ్, హెచ్ఎం ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలుగడ్డ పంట పరిశీలన

ఝరాసంగం(జహీరాబాద్): ఆలుగడ్డ పంటలను జహీరాబాద్ ఆర్డీఓ రమేష్ బాబు, తహసీల్దార్ శ్రీనివాస్‌లు పరిశీలించారు. మంగళవారం కుప్పానగర్ గ్రామంలోని రాచన్న పొలంలో ఆలుగడ్డ పంటతీత పనులను పరిశీలించారు. పంట సాగులో మార్కెటింగ్ లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణ ఆనందదాయకం

పుల్‌కల్(అందోల్): ప్రభుత్వం నిర్మించిన క్రీడా ప్రాంగణాల్లో క్రీడలు నిర్వహించడం ఆనందంగా ఉందని పుల్‌కల్ ఎంపీడీఓ మధులత అన్నారు. మంగళవారం పెద్దారెడ్డిపేట క్రీడా ప్రాంగణంలో సర్పంచ్ సతీష్ కుమార్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తలారి అంజయ్య, సుభాష్ చందర్ పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరందేనా..?

ఏటా తగ్గుతున్న సాగు
- శిథిలమైన కాల్వలు, తూములు
- బీడుబారుతున్న భూములు



జలకళతో కాకివాగు ప్రాజెక్టు(ఇన్‌సెట్‌లో తూము)

కంగ్టి(నారాయణఖేడ్): తెలంగాణలో చెరువు కింది ప్రతీ సెంటు భూమికి సాగునీరందిస్తామని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా తయారయ్యాయి. మిషన్ కాకతీయ పనులు నిర్వహించినా రైతులకు ప్రయోజనం చేకూరలేదు. ప్రజాధనం వెచ్చించినా ఆయకట్టు భూములకు సాగునీరందలేదు. నారాయణఖేడ్ నియోజక వర్గంలో నల్లవాగు ప్రాజెక్టు తర్వాత అత్యంత పెద్ద చెరువుగా చెప్పుకుంటున్న కాకివాగు ప్రాజెక్టు నుంచి రైతులకు ఏటా కన్నీరే మిగులుతుంది. కంగ్టి, దామర్‌గిద్దా శివారులో కాకివాగు ప్రాజెక్టు కింద బాన్సువాడ, దామర్‌గిద్దా, జమ్గి(బీ), గాంధీనగర్, సాధుతండా పరిసరప్రాంతాల్లో 1030 ఎకరాల షెడ్యూల్డ్ ఆయకట్టు ఉంది.

సాగునీటి నిర్వహణ లోపం ప్రధాన కారణం

◆ వర్షాలు ఎక్కువగా కురిసినా రైతులకు సాగు గండాలు తప్పడం లేదు. నిండుకుండలా చెరువుల్లో నీరున్నా సాగుకు మాత్రం నీరందడంలేదు. కాల్వలు, తూములు శిథిలం కావడం వెరసి నిర్వహణలోపం రైతుల పాలిట శాపంగా మారింది. కాల్వలకు తరచూ నిధులు కేటాయించడం కంటే నూతన నిర్మాణాలు చేయాలని రైతులు కోరుతున్నారు. వానాకాలం పంటలు పూర్తయ్యే వరకు అలుగు నుంచి నీరు వృథా అయ్యింది. కాగా చెరువు కింద షెడ్యూల్ ఆయకట్టు 1030 ఎకరాలు ఉండగా ఇరిగేషన్, రెవెన్యూ మరియు వ్యవసాయాధికారులు సమన్వయంతో యాసంగికి 240 ఎకరాలకు మాత్రమే ఆరుతడి పంటలకు సాగు నీరు అందిస్తున్నారు.

మంత్రి హరీష్‌రావు ఆదేశాలు బేఖాతర్:

◆ గతంలో ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు చెరువులు, కాల్వల పరిస్థితులను పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ పద్మారావు, సలహాదారు మల్లయ్య, ఏఈలు మైలారం రవి, సూర్యకాంత్ తదితరులు చెరువు, కాల్వల పరిస్థితిని పరిశీలించారు. దీంతో చెరువు కాల్వల పునరుద్ధరణకు రూ.8.23 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అధికారులు పంపిన ప్రతిపాదనలు మంజూరుకు నోచుకోకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి కాల్వలు ధ్వంసం



సాగునీటి కాల్వల మరమ్మతుల్లో భాగంగా 2016 ఖరీఫ్‌లో జేసీబీతో రాళ్లను పెకలించి ఒడ్డున చేర్చారు. దీంతో కాల్వల్లో మట్టి నిండుకొని పంటలకు నీరందకుండా పోయింది.

రాములు, బాన్సువాడ, కంగ్టి మండలం

తూముల లీకేజీతో సాగు నీరు వృథా



చెరువుకట్ట కుడి కాల్వ తూము డోర్ పూర్తిస్థాయిలో మూయకపోవడంతో నీరు లీకేజీ అవుతుంది. దీనికి తోడు కాల్వల్లోని బెడ్ సైతం జేసీబీతో తోడేశారు. దీంతో కాలువ పూర్తిగా గుంతలమయంగా మారింది.

యాదయ్య, కంగ్టి మండలం

సాగు కాల్వల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు



గతంలో మొదటి విడత మిషన్ కాకతీయలో చెరువు, కాల్వలకు మరమ్మతులు నిర్వహించలేదు. తూములు, కాల్వలు పూర్తిగా శిథిలం అయ్యాయి. దీంతో ఆయకట్టు రైతులకు సాగు నీరు అందడం లేదు. 2017, నవంబర్‌లో రూ. 8.23 కోట్లతో కాల్వల పునరుద్ధరణకు ప్రతిపాదనలు చేశాం. మళ్లీ రివైజ్డ్ ప్రతిపాదనలు సైతం మూడేళ్ల క్రితం చేశాం. మంజూరు కాలేదు.

డి.విజయ్‌భాస్కర్, డీఈఈ, ఇరిగేషన్, నారాయణఖేడ్

రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటుపై అవగాహన



మాట్లాడుతున్న రమేశ్ చౌహాన్

నారాయణఖేడ్: ఖేడ్ మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. సేవాలాల్ సంఘం అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, వ్యవసాయ అధికారి శంకర్‌లు మాట్లాడుతూ రైతుకుటుంబాల్లో 5 నుంచి 10 కుటుంబాలు ఒక జట్టుగా, 75జట్లు కలిసి ఒక ప్రధానజట్టుగా ఏర్పాటు కావాలన్నారు. దీంతో రూ.20వేల చొప్పున రూ.15లక్షలు సభ్యత్వంగా చెల్లిస్తే ప్రభుత్వం రూ.15లక్షలు ఈక్విటీ గ్రాంట్‌గా ఇస్తుందన్నారు. తద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, కమ్యూనిటీ సోషల్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు యాదవరెడ్డి, రాజ్‌కుమార్, రాములు, మౌనేష్ పాల్గొన్నారు.

పెంచిన పన్నులు తగ్గించాలని నిరసన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో పెంచిన ఆస్తి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ కౌన్సిలర్ హన్మంత్‌రెడ్డి, కార్మిక నేత వరప్రసాద్‌రెడ్డి మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పన్నులు పెంచడంతో పేదలపై భారం పడుతుందన్నారు. వెంటనే పెంచిన పన్నులు తగ్గించాలన్నారు. పన్నులు తగ్గించకపోతే ప్రతినిత్యం దశలవారిగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆర్వో శ్రీధర్‌రావుకు వినతి పత్రం అందించారు. రాజ్‌గోపాల్, రమణయ్య, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు

'నిర్లక్ష్యధోరణి సరికాదు'



మాట్లాడుతున్న ఎంపీపీ చాందీబాయి

నారాయణఖేడ్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఖేడ్ ఎంపీపీ కర్ర చాందీబాయి చౌహాన్ తెలిపారు. నారాయణఖేడ్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సాధరణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పంచాయతీరాజ్ ఏఈలు, అందుబాటులో ఉండకపోవడంతో చేసిన పనులకు బిల్లులు రాక ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు తప్పడంలేదని జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గత ఆరునెలలుగా నిధులు మంజూరుకాక గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామన్నారు. మంజూరైన నిధులను అధికారులు దారిమళ్లించడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే పంచాయతీ ఖాతాల్లో నిధులు జమచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు గౌరవ వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): వీఓఏలకు రూ.15వేల గౌరవ వేతనం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ రావు డిమాండ్ చేశారు. జిన్నారం, గుమ్మడిదలలో వీఓఏలతో బొంతపల్లి కమాన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి వీఓఏలు వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు. గౌరవ వేతనాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



ఆందోళన చేస్తున్న వీఓఏలు

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

న్యాల్‌కల్(జహీరాబాద్): వివిధ గ్రామాల్లో కంటి వెలుగు కొనసాగుతుంది. మంగళవారం న్యాల్‌కల్, గణేష్‌పూర్, రుక్మాపూర్‌లో కంటి పరీక్షలు చేశారు.

జహీరాబాద్: కంటి వెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. కేంద్రాలకు వచ్చే వారిని కంటి పరీక్షల తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని హోతి, మొగుడంపల్లి కేంద్రాలను సందర్శించారు.

జోగిపేట(అందోల్): కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సూచించారు. జోగిపేటలోని రెండో వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.

జహీరాబాద్: కంటి పరీక్షలు చేయించుకొని, కంటి చూపును మెరుగు పర్చుకోవాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ ఎస్.పెంటారెడ్డి, జెడ్పీటీసీ అరుణ, మండల బీఆర్ఎస్ నాయకులు విజయ్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ్‌కుమార్, సంజీవరెడ్డి, బి.సురేష్, శంకర్‌నాయక్, హబ్సిరాజు, గోపాల్, ఈశ్వర్‌రెడ్డి, రూప్‌సింగ్, ఉమేష్, శేకర్, సంజీవ్, హైదర్‌పటేల్, ఓంకార్, షకీల్, తుకారం, సీతారాంరెడ్డి, కేషనాయక్, రామ్‌శెట్టి, బాల్‌రాజ్, గోవర్ధన్‌రెడ్డి, మధు, డాక్టర్ సీతారామరాజు పాల్గొన్నారు.



జోగిపేట(అందోల్): శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

కొండాపూర్(సంగారెడ్డి): తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంటి వెలుగు నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 24 నుంచి నాలుగు రోజుల పాటు విద్యార్థులకు కంటి పరీక్షలు చేయిస్తామన్నారు.

మునిపల్లి(అందోల్): మునిపల్లిలో సర్పంచ్ రమేశ్ కంటి వెలుగు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయి కుమార్, మాజీ ఎంపీపీ చంద్రయ్యతో బీఆర్ఎస్ యువత మండల అధ్యక్షుడు ఆనంద్ పాల్గొన్నారు.

రజకులకు ఐరన్ బాక్సుల అందజేత



ఐరన్‌బాక్సులను అందిస్తున్న ఎంపీపీ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రజకులకు ఎంపీపీ రవీందర్‌గౌడ్ ఎలక్ట్రిక్ ఐరన్ బాక్సులను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు స్వయం ఉపాధి పొందాలని, వారి అభివృద్ధికి కృషి చేస్తామని రవీందర్‌గౌడ్ అన్నారు.

చెత్తా, చెదారంతో పట్టణ ప్రకృతి వనం



ప్రకృతి వనంలో పేరుకపోతున్న చెత్త

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని పట్టణ ప్రకృతి వనంలో పచ్చని చెట్లతో కాకుండా చెత్తాచెదారంతో నిండిపోయింది. ప్రభుత్వం పట్టణ ప్రగతిలో భాగంగా పట్టణ ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేసింది. పట్టణ ప్రగతిలో అధికారులు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారే తప్పా దానిని పర్యవేక్షణ చేసిన పాపనపోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణ ప్రకృతి వనాన్ని పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయ జయంతి



జయంతిలో పాల్గొన్న పద్మశాలీలు

సదాశివపేట(సంగారెడ్డి): మార్కండేయ మహర్షి జన్మదిన వేడుకలు మంగళవారం శ్రీఈశ్వర మార్కండేయ మందిరంలో వైభవంగ నిర్వహించారు. మేలుకొలుపుసేవ, నిత్యార్చన, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, డోలారోహణం, రుద్రస్వాకార యజ్ఞం, ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎస్. కృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు అంబటి విశ్వనాథం, మాజీ అధ్యక్షుడు పాస్కంటి మల్లేశం, కౌన్సిలర్లు పులిమామిడి రాజు, గుండు రవి, చౌదరి ప్రకాష్, ఆలయ కమిటీ చైర్మన్ చిలువరి రవికుమార్, పాలక మండలి సభ్యులు చింత పద్మఆనంద్ పాల్గొన్నారు.

జహీరాబాద్: పట్టణంలో మార్కండేశ్వర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధ్వి మరుద్వతి మహిళా సంఘం నాయకులు గడ్డం జనార్దన్, కె.మనోహర్, నాందేవ్, రమేష్, నర్సింహులు, ఒగ్గు విఠల్, మార్కండేశ్వర్, పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ఖేడ్‌లోని పద్మశాలి భవన్‌లో మంగళవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. మార్కండేయుడి చిత్రపటానికి పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు, డోలారోహణం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు అనంతం మార్కండేయుడి చరిత్రను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంగయ్య, గున్నాల నర్సింహులు, శ్రీనివాస్, రాఘవులు, పండరి, అంజయ్య, జెట్ల భాస్కర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **47 మందికి కోవిడ్ టెస్టులు**

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి . మంగళవారం 47 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు.

◆ **పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో మంగళవారం పీఆర్‌టీయూ సంఘం అధ్యక్షుడు విఠల్, తహసీల్దార్ ప్రభులు, ఎంపీడీఓ వెంకటేశం, ఎస్సై ఏడుకొండలు 2023 నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అబేద్‌మియా, శంకర్, ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్, సురేష్, సంగారెడ్డి, వీరప్ప, నగేష్‌లు ఉన్నారు.

◆ **కొనసాగుతున్న జాతర**

జిన్నారం(పటాన్‌చెరు): రాళ్లకత్వ గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం కూడా కొనసాగాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు జాతరకు హాజరయ్యారు.

◆ **కేలండర్ ఆవిష్కరణ**

జిన్నారం(పటాన్‌చెరు): మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ కేలండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **సదాశివపేట(సంగారెడ్డి):** సదాశివపేట ప్రింట్ మీడియా అసోసియేషన్ 2023 నూతన కేలండర్‌ను ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నల్లోల్ల వెంకటేశం గౌడ్, ఉపాధ్యక్షుడు బషీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి నాయికోటి విశ్వనాథం, సహాయ కార్యదర్శి నెల్లి శ్రీనివాస్, కోశాధికారి ఒగ్గు గణేష్, కార్యవర్గ సభ్యులు పి. శ్రీశైలం, బత్తిని శేఖర్, పాల్గొన్నారు.

◆ **'సేవాలాల్ జయంతిని సెలవురోజుగా ప్రకటించాలి'**

నారాయణఖేడ్: గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15వ తేదీని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని బంజారా ఉద్యోగుల సంఘం ఖేడ్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేగ్యానాయక్, హరిసింగ్ కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. సంఘం నాయకులు గురునాథ్, జీవన్ రాథోడ్, శివనాయక్, కాశీనాథ్‌జాదవ్, శివరాం నాయక్, రతన్‌సింగ్ పాల్గొన్నారు.

◆ **పెండింగ్ జీతాలు ఇవ్వాలని వినతి**

జహీరాబాద్ టౌన్: పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం సీడీపీఓకు వినతి పత్రం ఇచ్చారు. యూనియన్ నాయకులు షాహిదాబేగం, అనురాధలు మాట్లాడుతూ టెక్నికల్ సమస్య పేరుతో డిసెంబర్ జీతాలు ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు ఇవ్వాలని వారు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి**

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వం తక్షణమే పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఫీజు రీఇంబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నగర విస్తారక్ శిరీష , పూజ గౌడ్, శశాంక్, తారా కళాశాల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నిఖిల్, రంజిత్, శివ, నిధిన్ తదితరులు పాల్గొన్నారు .

◆ **ప్రతీ ఒక్కరు భగవద్గీత చదవాలి**

న్యాల్‌కల్(జహీరాబాద్): కుల, మత భేదాలు లేకుండా ప్రతీ ఒక్కరు భగవద్గీతను చదవాలని గీతా ప్రచారకులు కృపాళ్లు, రామాచార్యులు, తిరుమలేశం, ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రచార బృందం మంగళవారం న్యాల్‌కల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతా మత గ్రంథం కాదని, దానిని ప్రతీ ఒక్కరు చదవాలని కోరారు. ప్రతి ఇంటికి భగవద్గీత చేరాలనే ఉద్దేశంతోనే ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మెడికల్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉర్సు పోస్టర్ ఆవిష్కరణ**

న్యాల్‌కల్(జహీరాబాద్): ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం కానున్న ఉర్సే షరీఫ్ హజ్రత్ పీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా జాతర పోస్టర్‌ను మంగళవారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు స్వప్న కుమారి, భాస్కర్, సిద్దిలింగయ్యస్వామి, శివశంకరయ్యస్వామి, ప్రవీణ్‌కుమార్, బస్వరాజ్, శివ స్వామి, నర్సింహులు, ఉత్సవ కమిటీ సభ్యులు యూనూస్ ఖాన్, వాహాబ్, మక్సూద్ మియా, ఖాదర్‌సాబ్, ఆవిష్కరించారు.

◆ **ఐనోలు మల్లన్న జాతరలో నీలం మధు**



పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ఐనోలు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర బీఆర్ఎస్ నాయకులు నీలం మధు ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ..నియోజకవర్గ పరిధిలో దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సంజీవ, శ్రీశైలం, మల్లేష్, పెద్ద మల్లేష్, పాల్గొన్నారు.

◆ **నేడు అందోల్‌లో కబడ్డీ టోర్నమెంట్**

జోగిపేట(అందోల్): అందోల్ మండల స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ప్రారంభం కానున్నాయి. కీర్తిశేషులు ఆకుల అంజయ్య జ్ఞాపకార్థం కబడ్డీ పోటీలు రెండు రోజులపాటు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ పోటీలను జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

పటాన్‌చెరు టౌన్: పెదకంజర్ల గ్రామ సమీపంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం చేపడుతున్నట్టు రీజినల్ కోఆర్డినేటర్ కళ్యాణి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీలతలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ, నెట్, స్లెట్ అర్హత గల అభ్యర్థులు 25 నుంచి 31వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఖాళీలు గణితం-1, కామర్స్-1, కంప్యూటర్ సైన్స్-2, కెమిస్ట్రీ-1, జువాలజీ-1 ఖాళీలు ఉన్నట్టు పేర్కొన్నారు.

◆ **ఎరువుల డీలర్లకు వర్క్‌షాప్**

జహీరాబాద్: ఎరువుల డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. మంగళవారం రంజోల్‌లో రైతు వేదికలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ భిక్షపతి మాట్లాడుతూ ఎరువుల క్రయ విక్రయాల నిర్వహణ, దానిపై పర్యవేక్షణలో పారదర్శకత ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ప్రవీణ, నవీన్‌కుమార్, వినోద్‌కుమార్, ఏఈఓలు ప్రదీప్‌కుమార్, బీటీఎం చరణ్, డీలర్లు పాల్గొన్నారు.

◆ **28,29 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్**

పటాన్‌చెరు టౌన్: మైత్రి గ్రౌండ్‌లో 28, 29 తేదీల్లో జీఎమ్ఆర్ వాలీబాల్ అకాడమి ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 8019487775 సాయి, 7842121201 నాగరాజును సంప్రదించాలని పేర్కొన్నారు.

◆ **కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లిలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. వార్డు సభ్యురాలు జయమ్మ, ఈఓ శాంతమ్మ పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌కు రాజీనామా**

జిన్నారం(పటాన్‌చెరు): నల్తూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాజీనామా చేశారు. అనంతరం చిట్కుల్ సర్పంచ్ నీలం మధు యువసేనలో చేరారు. చిట్కుల్ సర్పంచ్ నీలం మధు చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆకర్శితులై కాంగ్రెస్‌కు రాజీనామా చేసినట్టు వారు తెలిపారు.

◆ **ఓటు నమోదు చేసుకోవాలి**

జహీరాబాద్ టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ రమేష్‌బాబు అన్నారు. ఓటు నమోదు చేసుకోవాలని మంగళవారం కళాకారులు కళాజాత నిర్వహించారు.

◆ **'సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తాం'**

మునిపల్లి(అందోల్): మండలంలోని ప్రతి గ్రామంలో, వార్డుల్లో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయి కుమార్ తెలిపారు. మంగళవారం పెద్దచల్మెడ గ్రామంలో సర్పంచ్ ప్రభుకుమార్, ఎంపీటీసీ రాధాబాయి జ్యోషిలు పనులను ప్రారంభించారు.